క్లుప్తంగా

వైభవంగా శివాజీ మహరాజ్ దివస్



సత్తెనపల్లి: ఛత్రపతి శివాజీ మహరాజ్ దివస్ ఊరేగింపు పట్టణంలో ఆదివారం వైభవంగా సాగింది.ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ శివాజీ మహరాజ్ దక్షిణ దివస్ యాత్ర సందర్భంగా విజయవాడ దుర్గమ్మ దేవస్థానం నుంచి మంగళగిరి, గుంటూరు, సత్తెనపల్లి, నరసరావుపేట, త్రిపురాంతకం, దోర్నాల నుంచి శ్రీశైలం దేవస్థానం వరకు యాత్ర జరుగుతుందన్నారు. దక్షిణ దిగ్విజయ యాత్రలో భాగంగా ఈ నేలపై మరాఠా సైన్యం అడుగు పెట్టి 348 సంవత్సరాలు పూర్తవుతుందన్నారు. ఈ సందర్భంగా శివాజీ మహరాజ్ దిగ్విజయ దివస్ అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. దీనిలో భాగంగా పట్టణంలోని పురవీధుల్లో ఘనంగా ఊరేగించారు. కార్యక్రమంలో శివాజీ యూత్ సభ్యులు, ఆర్య వైశ్య ప్రముఖులు, ఆర్ఎస్ఎస్ సభ్యులు పాల్గొన్నారు.

150 మందికి గుండె పరీక్షలు



సత్తెనపల్లి: పట్టణంలోని శరభయ్య గుప్తా హిందూ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం ఎదురుగా ఉన్న ఎస్వీఆర్ డిగ్రీ కళాశాలలో ఆదివారం ఏఆర్ సేవా సదన్ సత్తెనపల్లి ఆధ్వర్యాన హెల్ప్ హాస్పిటల్స్ మల్టీ సూపర్ స్పెషాలిటీ కేర్ విజయవాడ వారి సౌజన్యంతో నిర్వహించిన ఉచిత మెగా గుండె వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరంలో విజయవాడ హెల్ప్ హాస్పిటల్స్ మల్టీ సూపర్ స్పెషాలిటీ కేర్ వైద్యులు ఎండీ డీఎం కార్డియాలజీ డాక్టర్ కార్తీక్ నాయుడు, పీజీ డీసీసీ డాక్టర్ నాగకిరణ్ వైద్య సేవలు అందించారు. సత్తెనపల్లి సమీప గ్రామాల నుంచి సుమారు 150 మంది గుండె పరీక్షలు చేయించుకున్నారు. శిబిరాన్ని ఎస్వీఆర్ విద్యాసంస్థల డైరెక్టర్ వీరవల్లి శ్రీనివాసరావు పర్యవేక్షించారు. శిబిరంలో ఏఆర్ సేవా సదన్ ప్రెసిడెంట్ దేవండ్ల ఆదినారాయణ, సెక్రటరీ ఎస్డీ రఫీ అహ్మద్, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



బాలెమర్రు(క్రోసూరు): ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీత, ఆధ్యాత్మిక గ్రంథాలను మండలంలోని బాలెమర్రు, అందుకూరు గ్రామాల్లో ఆదివారం ప్రచారం చేశారు. 'త్రైత సిద్ధాంతం, ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞాన వేదిక' సభ్యులు కటికం సైదారావు, యద్దనపూడి వీరాంజనేయులు, కె.అరుణ, కె.కార్తీక్, కె.నారాయణమ్మ, సీహెచ్ అనురాధ, ఎస్.వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దాసునాయన మఠంలో ఆధ్యాత్మిక ప్రవచనాలు

నాదెండ్ల: గణపవరం గ్రామంలో కొలువైయున్న ఆంజనేయస్వామి ఉపాసకులు అచల దాసునాయన సద్గురు మఠంలో ఆదివారం మఠాధిపతుల ప్రవచనాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మఠం పీఠాధిపతి కటారు దాసునాయన అధ్యక్షత వహించగా, నరసరావుపేట అఖిలపీఠం పీఠాధిపతి చిమటా వెంకటరావు శిష్యుడు పుల్లారావు, ఫిరోజ్ పీఠం అధిపతి పోకల వెంకటరావు, గుంటూరు బ్రహ్మంగారి పీఠం అధిపతి సుగుణ ప్రవచనా లు వినిపించారు. భగవద్గీత అంతరార్థం, వేదాంత పరిచయం, వేద విజ్ఞానం, ఆత్మజ్ఞానాన్ని పొంది జీవన్ముక్తులగుట అనే అంశాలపై ప్రసంగించారు. అన్నదానం చేశారు. కార్యక్రమాలను నూతలపాటి హనుమాయ మ్మ, కటారు శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

కూలీలు కేవైసీ తప్పక చేయించుకోవాలి

కారెంపూడి: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్క ఉపాధి కూలీ ఆధార్ కేవైసీ తప్పక చేయించుకోవాలని డ్వామా పీడీ సిద్ధ లింగమూర్తి కోరారు. మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో ఆదివారం పీడీ పర్యటించారు. కొందరు కూలీలకు పీడీ స్వయంగా కేవైసీ చేశారు. ఉపాధి పనులకు వచ్చిన వారికి ఇక రానున్న రోజుల్లో హాజరు కేవైసీ ద్వారా మాత్రమే వేయాల్సి ఉంటుందన్నారు. అందరూ కూడా తప్పనిసరిగా తమ గ్రామాలలోని ఫీల్డ్ అసిస్టెంట్స్‌ను కలసి కేవైసీ చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీడీ సత్యనారాయణ, ఏపీవో కె.నాగేశ్వరరావు, టీఏ అంజిరెడ్డి, ఎఫ్ఏ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

భవనాలున్నా నిరుపయోగం!



ముళ్ల కంచెలతో ఉన్న ఆరోగ్య ఉపకేంద్రం



కమ్యూనిటీ హాల్ ఇలా

- 'రాజుపాలెం'లో ప్రభుత్వ భవనాలు
- ముళ్ల కంచెలతో అధ్వానంగా ఆరోగ్య ఉపకేంద్రం
- అసాంఘిక శక్తులకు నిలయం

రాజుపాలెం: భవనాలున్నా నిరుపయోగం గా మారాయి. మండల పరిధిలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ భవనాలు శిథిలావస్థకు చేరాయి. ముళ్ల కంచెలతో కనిపిస్తున్నాయి. ఈ భవనాలను వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సుమారు 15 ఏళ్ల క్రితం లక్షలు వెచ్చించి అన్ని హంగులతో పులిచింతల నిర్వాసిత కేంద్రంలో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఆ భవనాలు శిథిలావస్థకు చేరుతున్నాయి. కట్టిన భవనాలను ఆయా శాఖలకు అప్పగించకపోవడంతో వాటిని పట్టించుకున్న నాథుడే లేడు.పైగా అవి అసాంఘిక శక్తులకు నిలయంగా మారుతున్నాయి.

వినియోగంలోకి తేవాలి

పులిచింతల ప్రాజెక్టు నిర్వాసితులు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసే సమయంలో 2005లో రాజుపాలెం పంచాయతీ పరిధిలో ఆరోగ్య ఉపకేంద్రం (సబ్ సెంటర్), గ్రంథాలయం, కమ్యూనిటీ హాల్, మరికొన్ని ప్రభుత్వ కార్యాలయాలను నిర్మించారు. ఈ కేంద్రంలో బోధనం, కేతవరం, చిట్యాల తండా, కోళ్లురు, గొల్లపేట, పులిచింతల, గోపాలపురం గ్రామాలకు చెందిన ప్రజలను 2011లో రాజుపాలెం పంచాయతీలోని పులిచింతల నిర్వాసిత కేంద్రానికి తరలిచారు. 1365 ప్లాట్‌లు కేటాయించారు. ప్రస్తుతం జనాభా సుమారు 2000 మంది ఉండగా, 950 ఓటర్లు ఉన్నారు. ఆరోగ్య ఉపకేంద్రం నిర్వహణకు ఆశ కార్యకర్తను కూడా నియమించారు. ఆరోగ్య సిబ్బంది ఆరోగ్య ఉపకేంద్రాన్ని 20 ఏళ్ల గడుస్తున్నా తలుపులు తీయలేదు. ముళ్ల కంపలు పెరిగి శిథిలావస్థకు చేరుతున్నాయని నిర్వాసితులు వాపోతున్నారు. కమ్యూనిటీ హాల్ పరిస్థితి కూడా అలాగే తయారైంది.



ధ్వంసమైన గ్రంథాలయ తలుపులు, కిటికీ అద్దాలు

అసాంఘిక శక్తుల తిష్ట

నిర్వాసిత కేంద్రంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయం అసాంఘిక శక్తులకు నిలయంగా మారింది. గ్రంథాలయానికి ఉన్న తలుపులను, కిటికీ అద్దాలను ఆకతాయలు ధ్వంసం చేశారు. రాత్రి వేళల్లో అసాంఘిక కార్యకలాపాలు జరగడమేకాకుండా మందుబాబులకు నిలయంగా మారింది. గ్రంథాలయం చుట్టూ ఉన్న నివాసితులు అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు భవనాలను వేరే ప్రభుత్వ కార్యాలయాలకు వినియోగించాలని నిర్వాసితులు కోరుతున్నారు.

భవిష్యత్తులో మరిన్ని సేవలు



సత్కారం అందుకున్న ఆర్యవైశ్య చలివేంద్ర సంఘ సభ్యులతో కొత్త రామకృష్ణ

సత్తెనపల్లి: వాసవి యువశక్తి సభ్యులందరూ భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని శ్రీ వాసవి యువశక్తి బాధ్యుడు కొత్త రామకృష్ణ అన్నారు. వాసవి యువశక్తి ఆధ్వర్యంలో ప్రతి నెలా మొదటి ఆదివారం గో సేవలో కార్యక్రమం నిర్వహించారు. రామకృష్ణ మాట్లాడుతూ శ్రీ వాసవి యువశక్తి సభ్యులు చాలా ఆసక్తిగా ఉన్నారని, సేవా కార్యక్రమాల్లో ముందుంటారన్నారు. వాసవి యువశక్తి సభ్యులు కొల్లిపర నరసింహారావు, జవ్వాజి సుబ్బారావు మాట్లాడుతూ దేవీ నవరాత్రులు ఘనంగా నిర్వహించినందుకు ఆర్యవైశ్య చలివేంద్ర సంఘ సభ్యులందరినీ సన్మా నించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య చలివేంద్ర సంఘం అధ్యక్షుడు బచ్చు కొండలు, గో సంరక్షణశాల అధ్యక్షుడు పెండ్యాల మల్లయ్య, కొల్లిపర హరికృష్ణ, చిలకల వాసు, వనమా నాగేశ్వరరావు, అయినవోలు వాసు, చలం, భవిరిశెట్టి రంజిత్, సుబ్రహ్మణ్యం, లఘుమ వరపు రమేష్ బాబు, శ్రీ వాసవి యువశక్తి సభ్యులు అనీలు, మోహన్, పుల్లారావు, రాధాకృష్ణ, తదితరులు ఉన్నారు.

భారీ వర్ష బీభత్సం.. రాకపోకలకు అంతరాయం!



రోడ్డుపై పడిపోయిన చెట్టు

యడ్లపాడు: మధ్యాహ్నం వరకు వేసవిని తలపించేలా మండుటెండతో ఉక్కిరిబిక్కిరి అయిన ప్రజలకు సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మారిపోయి ఊరటనిచ్చింది. కారుమబ్బులు దట్టంగా అలుముకుని, ఉరుములు, ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం జనజీవనాన్ని అస్తవ్యస్తం చేసింది. ఈదురు గాలుల తీవ్రతకు బోయపాలెం నుంచి చెంఘీజ్‌ఖాన్‌పేట వెళ్లే మార్గంలో పలుచోట్ల భారీ చెట్లు నేలకూలాయి. ముఖ్యంగా గురుకుల పాఠశాల మార్గం నుంచి సంగం గోపాలపురం వరకు ఆర్ అండ్ బీ రహదారిపై పెద్ద పెద్ద చెట్లు అడ్డంగా పడటంతో ద్విచక్ర వాహనాలు సైతం వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఈ మార్గంలో విద్యుత్ లేకపోవడం, చెట్లు, కొమ్మలు రోడ్డుపై అడ్డంగా పడి ఉండటంతో వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. స్థానికులు రోడ్డుపై ఉన్న వాటిని అడ్డుతొలగించినట్లు సమాచారం.

ముగిసిన సామాజిక తనిఖీ గ్రామ సభలు

బొల్లాపల్లి: మండలంలో సామాజిక తనిఖీ గ్రామ సభలు ముగిశాయి. ఆదివారం మండలంలో అయ్యన్నపాలెం, మేకలదిన్నె, లాలిపురం, సీతాపురం తండా, బండ్లమోటు, బొల్లాపల్లిలో గ్రామ సభలు నిర్వహించారు. ఆయా గ్రామ సభల్లో పనుల తనిఖీలకు సంబంధించిన నివేదికను చదివి వినిపించారు. గ్రామ సభల్లో ఎస్ఆర్పీ బి.ఆవులయ్య, ఏపీవో పి.వెంకటేశ్వర్లు, డీఆర్పీ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివి

ముప్పాళ్ళ: మండలంలోని ముప్పాళ్ళ విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో 11కేవీ దమ్మాలపాడు ఫీడర్ మరమ్మతుల్లో భాగంగా ఈ నెల 6వ తేదీన విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ జి.సుచరిత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫీడర్ పరిధిలోని దమ్మాలపాడు, బొల్లవరం, రుద్రవరం గ్రామాల్లో ఉదయం 8నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

నకరికల్లు: అత్యవసర మరమ్మతుల కారణంగా మండలంలోని కొన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఏఈఈ జి.సుచరిత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని దేచవరం, రూపెనగుంట్ల, శాంతినగర్ గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు.

గిరిజన గురుకులాల్లో తాత్కాలిక ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి

సత్తెనపల్లి: గిరిజన గురుకుల ఆశ్రమ పాఠశాలల్లో రెండు, మూడు దశాబ్దాలుగా పనిచేస్తున్న తాత్కాలిక(అవుట్‌సోర్సింగ్) ఉపాధ్యాయులను తొలగించకుండా న్యాయం చేయాలని లోక్ జనశక్తి పార్టీ(రామ్ విలాస్) పల్నాడు జిల్లా అధ్యక్షుడు జొన్నలగడ్డ విజయ్ కుమార్ డిమాండ్ చేశారు. పట్టణంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో బాధిత ఉపాధ్యాయులతో కలసి ఆదివారం ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 164 పాఠశాలల్లో 1,600 మంది ఉపాధ్యాయులు అవుట్ సోర్సింగ్ ద్వారా పని చేస్తున్నారన్నారు. వారిని కాదని మెగా డీఎస్సీలో ఎంపికైన వారికి ఇచ్చి వీరికి అన్యాయం చేయకుండా న్యాయం చేయాలన్నారు. సమావేశంలో ఉపాధ్యాయులు సీహెచ్ నాగేశ్వ రావు, మందడపు శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

అపూర్వం.. ఆనందం

- నాలుగు దశాబ్దాల తర్వాత మిత్రుల కలయిక
- నాటి గురువులకు సత్కారం



అమరావతి రామకృష్ణా హిందూ హైస్కూల్ 1985-86 టెన్త్ బ్యాచ్

అమరావతి: ఎంతో చరిత్ర కల్గిన అమరావతి శ్రీరామకృష్ణ హిందూ హైస్కూల్ 1985–86 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు దశబ్దాల తర్వాత కలుసుకున్నారు. నాలుగు దశాబ్దాలు కలుసుకున్న వీరంతా ఆదివారం సందడి చేశారు. విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం.. ఆనందాల వేదికగా మారింది. దశాబ్దాల క్రితం టెన్త్ తర్వాత విడిపోయిన వీరు జీవితంలో విభిన్నదారుల్లో పయనిస్తున్నారు. ఇలాంటి సమయంలో వీరు చిన్ననాటి స్నేహితులను కలుసుకోవాలని సంకల్పించారు. రాష్ట్రం నలుమూలల్లో ఉన్న సుమారు 150 మంది చిరునామాలు సేకరించారు. ఆదివారం వారు చదువుకొన్న ఉన్నత పాఠశాలలో ఒకే వేదిక పైకి చేరుకున్నారు. 1985–86లో పాఠశాలలో పదో తరగతి చదివిన చదువుకున్న వారు 40 ఏళ్ల తర్వాత ఆదివారం ఆత్మీయ సమ్మేళనంలో తిరిగి కలుసుకున్నప్పుడు ఒక్కసారిగా అందరిలో ఉద్వేగం... ఆనందం అపురూపమైన ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. పరస్పర పలకరింపులు, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆనాడు తరగతులలో తాము చేసిన చిలిపి పనులు, మాస్టర్ల దండనలు, మందలింపులు, హితబోధలు ఒకరికొకరు చెప్పుకుని ఆనందంగా గడిపారు. వారు పాఠశాలకు వచ్చేసరికి ఒక్కసారిగా చిన్న పిల్లలుగా మారి ఆనాటి ముచ్చట్లు చెప్పుకుని మురిసి పోయారు. అందరు ఫోన్ నంబర్లు, చిరునామాలు సేకరించుకున్నారు. తమ ఉన్నతికి దోహదపడిన ఆనాటి గురువులను గుర్తు చేసుకుని సన్మానించారు. స్నేహ బంధానికి గుర్తుగా ఫొటోలు దిగారు. ఈ సందర్భంగా చదువుకున్న పాఠశాల అభివృద్ధికి తామంతా కలిసి సాయం చేయాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా పాఠశాల పాలకవర్గ అధ్యక్షుడు వజినేపల్లి శేఖర్ బాబు, మాజీ ప్రధానోపాధ్యాయుడు కొల్లి లక్ష్మీనారాయణ, విశ్రాంతఉపాధ్యాయులు కలువకొలను నరసింహమూర్తి, వారణాసి వెంకటేశ్వరశర్మ, ఒ.వి. రామిరెడ్డిలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో 75మందికి పైగా పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.



అపూర్వమే ..

జీవితంలో స్థిరపడిన ఇన్నేళ్ల తర్వాత చిన్ననాటి స్నేహితులందరిని ఒకే చోట కలుసుకోవటం నిజంగా అపూర్వమే. ఇది ఒక రకంగా మా స్నేహితులందరి అదృష్టంగా భావిస్తున్నా. మిత్రులంతా ఎప్పటికైనా ఇలాగే ఆత్మీయ అనుబంధాలతో కలిసి ఉండాలని కోరిక. ఏటా ఇలాగే కలుసుకోవాలని అనుకుంటున్నాం.

–పులిపాటి పవన్‌కుమార్, వ్యాపారస్తుడు, అమరావతి



బాల్య స్నేహానికి ప్రత్యామ్నాయం లేదు

చిన్ననాటి స్నేహానికి ప్రపంచంలో ప్రత్యామ్నాయం లేదు. అందరిని ఒకే చోట కలుసుకోవటం చాలా ఆనందంగా ఉంది. ఎంత పెద్ద స్థాయికి వచ్చినా దొరకని ఆనందం, సంతోషం ఈ రోజు కలిగింది. ఇప్పటికీ మేము ఆనాటి స్నేహితులమేనని చెప్పుకోవడానికి గర్వంగా ఉంది. ఈ కలయిక జీవితంలో కొత్త ఉత్సాహం, ఉత్తేజాన్ని ఇస్తోంది.

–కొల్లి నాగేశ్వరరావు, కంటివైద్యుడు, విజయవాడ



చాలా ఆనందంగా ఉంది

ఎన్నో ఏళ్ల తర్వాత ఇలా అందరినీ కలుసుకోవడం చాలా ఆనందంగా ఉంది. ఇన్నేళ్ల తర్వాత ఉపాధ్యాయులను గుర్తుంచుకుని గౌరవించటం, తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి ఆర్థికసాయం అందించాలని నిర్ణయం తీసుకున్నాం. నిధులు సేకరించి విద్యాభివృద్ధికి కృషి చేస్తాం.

–దార్ల శ్రీనివాసరావు, గణిత ఉపాధ్యాయుడు, జెడ్పీ హైస్కూల్, తెనాలి

విద్యుత్ ఉద్యోగుల వెతలు తీర్చండి



బెల్లంకొండలో వాల్‌పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న విద్యుత్ కార్మికులు, జేఏసీ నాయకులు

బెల్లంకొండ: విద్యుత్ శాఖ ఉద్యోగులు, కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏపీ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ జేఏసీ నేత కె.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌లో స్థానిక ఉద్యోగులు, కార్మికులతో కలిసి సమ్మె వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. తమ సమస్యలను ప్రభుత్వానికి పలు మార్లు విన్నవించినా స్పందన లేకపోవడంతో సమ్మెకు దిగనున్నట్లు తెలిపారు. ఎన్నో ఏళ్ల నుంచి పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులందరినీ సంస్థలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని, వారికి ఇవ్వాల్సిన పీఆర్సీ బకాయిలు, 17 నెలల వేతనం, 10 ఏళ్ల సర్వీస్ పూర్తయిన వారికి ఇస్తున్న సర్వీస్ ఇన్సెంటివ్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈనెల 13 వరకు పలు దఫాలుగా ధర్నా కార్యక్రమాలు చేయనున్నామన్నారు. అప్పటికీ సమస్యలు పరిష్కరించకపోతే ఈ నెల 15 నుంచి నిరవధిక సమ్మెకు దిగనున్నట్లు పేర్కొన్నారు. కార్మికులు పాల్గొనాలని జేఏసీ నాయకులు కోరారు. కార్యక్రమంలో పరిపూర్ణాచారి, జిలాని, శ్రీనివాస్, గుణశేఖర్, నరసింహారావు, నాగుల్ మీరా, శివారెడ్డి, సుభాని, వెంకట్రావు, ఏడుకొండలు, యలమంద పాల్గొన్నారు.

జెడ్పీ పాఠశాలలో ఇబ్బందులు తొలగించండి

సీపీఎం జిల్లా కార్యదర్శి రవిబాబు



జెడ్పీ పాఠశాలలో నిలిచిన నీటిని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

బెల్లంకొండ: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో నిల్వ ఉన్న వర్షం నీటిని వెంటనే బయటకు పంపడానికి చర్యలు తీసుకోవాలని సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శి జి.రవిబాబు డిమాండ్ చేశారు. కొన్ని నెలలుగా హై స్కూల్ ఆవరణలో వాన నీరు నిల్వ ఉండటంతో ఆదివారం సీపీఎం మండల నాయకులు కలిసి పరిశీలించారు. వందల మంది చదువుకుంటున్న హైస్కూల్లో నెలల తరబడి నీరు నిల్వ ఉన్నా పట్టించుకోకపోవడం అన్యాయమని తెలిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు తరగతి గదులకు వెళ్లాలంటే ఎన్నో ఇబ్బందులు పడుతున్నారన్నారు. నీరు నిల్వ ఉండడంతో దుర్వాసన వెదజల్లుతూ ఈగలు, దోమలు పెరుగుతున్నాయన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ చర్యలు చేపట్టకపోవడంతో మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తోందని వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి చిన్నం పుల్లారావు, నరసింహారెడ్డి, దుగ్గి కోటేశ్వరరావు, రాజారావు పాల్గొన్నారు.

పాలిథిన్ భూతాన్ని తరిమి కొడదాం

అమరావతి సేవా సమితి అధ్యక్షుడు వీరాంజనేయులు



నార సంచులు పంపిణీ చేస్తున్న దృశ్యం

సత్తెనపల్లి: చేయి చేయి కలుపుదాం .. పాలిథిన్ భూతాన్ని తరిమి కొడదామని అమరావతి సేవా సమితి అధ్యక్షుడు గొల్లపల్లి వీరాంజనేయులు పిలుపునిచ్చారు. అమరావతి సేవాసమితి ఆధ్వర్యంలో ఉపాధ్యాయుడు గుండ్లపల్లి కృష్ణ ఆర్థిక సాయంతో పట్టణంలో పండ్లు మార్కెట్, వ్యాపార, వాణిజ్య కూడళ్లలో ఆదివారం పాలిథిన్ వాడకంపై అవగాహన కలగజేసి నార సంచులు పంచారు. ఈ సందర్భంగా వీరాంజనేయులు మాట్లాడుతూ నేటి సమాజంలో పాలిథిన్ వాడకం సర్వసాధారణమైందని, దీంతో కలిగే అనర్థాలు కళ్ల ముందు కనిపిస్తున్నా అనేక మంది బాధ్యతారాహిత్యంగా ఉన్నారన్నారు. ఇంటికి వెళ్లేటప్పుడు వస్తువులను సగటు వ్యక్తి పాలిథిన్ సంచు ల్లోనే తీసుకెళ్తున్నారని, అవి మానవాళికి పెను సవాల్ విసురుతున్నాయన్నారు. అటు మూగజీవాల ప్రాణాలను సైతం హరిస్తున్నాయన్నారు. పాలిథిన్‌తో కలిగే అనర్థాలపై ప్రతి ఒక్కరూ చైతన్యం పెంచుకోవాలన్నారు. అప్పుడే వాటి నిషేధం పూర్తిగా జరుగుతుందని చెప్పారు. ఇప్పటి నుంచే పాలిథిన్ సంచులకు ప్రత్యామ్నాయంగా నార సంచులను వినియోగించాలన్నారు. లేకపోతే భవిష్యత్తు తరాలకు పెను ముప్పు తప్పదని ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి వ్యక్తి ఇంటి నుంచి బయటకు వెళ్లేటప్పుడు జ్యూట్ సంచిని తీసుకెళ్లడం అలవాటు చేసుకోవాలన్నారు. పాలిథిన్ సంచులు రోడ్లపై వేయడంతో మూగజీవాలకు ప్రాణాంతకంగా మారుతున్నాయన్నారు. కార్యక్రమంలో సమితి కార్యదర్శి పాటిబండ్ల రవి రాజా, సభ్యులు షారోన్ కుమార్, బాలాజీ నాయక్, బబ్బు, తీర్రు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు



అమరావతి పురవీధులలో కవాతు చేస్తున్న ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు

అమరావతి: ప్రసిద్ధ పుణ్య క్షేత్రమైన అమరావతిలో ఆదివారం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో సంఘ శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అమరేశ్వరాలయం గాలిగోపురం నుంచి ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు గణవేష్‌లో కవాతు చేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ప్రాంత కార్యవాహ వేణుగోపాల్‌నాయుడు మాట్లాడుతూ దేశంలో వందేళ్లుగా 81వేల శాఖల ద్వారా లక్షలాది మందిని దేశభక్తి, క్రమశిక్షణగల వ్యక్తులుగా ఆర్ఎస్ఎస్ తీర్చిదిద్దుతోందన్నారు. సంఘం స్థాపించి వందేళ్ళు పూర్తయిన సందర్భంగా దేశంలోని చిట్టచివరి గ్రామంలో కూడా హిందూ ధర్మం కోసం – దేశం కోసం పనిచేసే హిందువులను కలపడం కోసం ప్రతి గ్రామం – ప్రతి బస్తీలో ఇంటింటికీ సంఘ్‌ను పరిచయం చేయాలనే యోజనతో శతాబ్ది కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. దానిలో భాగంగా అమరావతి ఉప మండలంలో నిర్వహించిన కార్యక్రమంలో కార్యకర్తలు గణవేష్ రావడం విశేషమన్నారు. శైవ క్షేత్రం పీఠాధిపతి శివస్వామి మాట్లాడుతూ హిందూ సమాజం అనేక వందల సంవత్సరాలుగా ఎదురు చూస్తున్న అయోధ్య రామాలయ నిర్మాణంలో, అయోధ్య రామ పూజిత అక్షితలను ఇంటింటికీ చేర్చడంలో సంఘ కార్యకర్తల కృషి మరువలేనిదన్నారు. కార్యక్రమంలో మండల పరిధిలోని అన్ని గ్రామాల నుంచి ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐక్య పోరాటంతోనే సమస్యల పరిష్కారం

నరసరావుపేట: ఐక్య పోరాటాలు చేయడం ద్వారానే అనేక సమస్యలు పరిష్కరించుకోవడం జరిగిందని ఏపీ ఆశావర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) పల్నాడు జిల్లా గౌరవ అధ్యక్షురాలు డి.శివ కుమారి పేర్కొన్నారు. కోటప్పకొండ రోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో ఆదివారం జిల్లా అధ్యక్షురాలు కె.చంద్రకళ అధ్యక్షతన పల్నాడు జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. శివకుమారి మాట్లాడుతూ ఆశాల పోరాటాల ఫలితంగా రూ.1.50 లక్షలు రిటైర్‌మెంట్ బెనిఫిట్, ఉద్యోగ విరమణ వయోపరిమితి 62 ఏళ్లు, 180 రోజులు ప్రసూతి సెలవులు సాధించుకున్నామన్నారు. నెలకొన్న అనేక సమస్యలు పరిష్కారానికి ఐక్య పోరాటాలు చేయాల్సి ఉందన్నారు. గర్భిణులను గ్రామీణ ప్రాంతాల నుంచి పీహెచ్‌సీలు, ఏరియా ఆసుపత్రికి తీసుకువస్తున్న ఆశా వర్కర్లకు ప్రభుత్వం టీఏ, డీఏలు ఇవ్వాలని, పనిభారం తగ్గించాలని, పీఎఫ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఆరున్నర ఏళ్ల క్రితం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పెంచిన వేతనాలే ఇప్పటికీ అమలవుతున్నాయన్నారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రత్న కుమారి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు విశేష సేవలు అందిస్తున్న ఆశాలకు కనీస వేతనాలు, వారాంతపు సెలవులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సెలవులు వర్తింపజేయాలని, మట్టి ఖర్చులకు రూ.20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్ల నియామకాలలో రాజకీయ జోక్యం ఉండకూడదని, ఏఎన్ఎం పోస్టుల భర్తీలో ఆశాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఆయా సమస్యల పరిష్కారం కోసం వచ్చే నెల చివరి వారంలో కలెక్టరేట్ వద్ద ధర్నాకు పిలుపునిచ్చామన్నారు. భవిష్యత్తులో యూనియన్ ఆధ్వర్యంలో పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. కోశాధికారి ఎం.ధనలక్ష్మి, కమిటీ సభ్యులు ఎం.చిన్నమ్మాయి, షేక్ మెహరున్నీసా తదితరులు పాల్గొన్నారు.

- **నకరికల్లు:** మండలంలోని నర్సింగపాడు గ్రామ పంచాయతీకి స్వచ్ఛాంధ్ర అవార్డు లభించిందని డెప్యూటీ ఎంపీడీఓ కె.వి.శివప్రసాద్ ఆదివారం తెలిపారు. స్వచ్ఛతా కార్యక్రమాలను ప్రోత్సహిస్తూ స్వచ్ఛతలో నూరుశాతం ఫలితాలు సాధించిన గ్రామంగా నర్సింగపాడును ఎంపిక చేశారన్నారు. అవార్డుకు కృషిచేసిన గ్రామ కార్యదర్శి కొమ్మవరపు అప్పారావును అభినందించారు.